# AIIMS BIBINAGAR CONDUCTS HEAD AND NECK CANCER AWARENESS PROGRAM

టైమ్స్ ఆఫ్ వార్త
తెలుగు దినపత్రిక

# తల, మెడ క్యాన్సర్‌ను ముందుగానే గుర్తించాలి

**మొరిపిరాలలో బీబీనగర్ ఎయిమ్స్ ఆధ్వర్యంలో ఉచిత ఆరోగ్య శిబిరం**

**80 మందికి వైద్య పరీక్షలు..**

**ఉచితంగా మందుల పంపిణీ**



టైమ్స్ ఆఫ్ వార్త–యాదాద్రి జిల్లా ప్రతినిధి

తల, మెడ క్యాన్సర్‌ను ముందుగానే గుర్తిస్తే సమర్థవంతమైన చికిత్స అందించే అవకాశం ఉంటుందని బీబీనగర్ ఎయిమ్స్ వైద్య నిపుణులు తెలిపారు. ప్రపంచ తల, మెడ క్యాన్సర్ అవగాహన దినోత్సవాన్ని పురస్కరించుకుని యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూర్(ఎం) మండలం మొరిపిరాల గ్రామంలో బీబీనగర్ ఎయిమ్స్ కమ్యూనిటీ మెడిసిన్ అండ్ ఫ్యామిలీ మెడిసిన్ విభాగం మొబైల్ మెడికల్ యూనిట్, ఈఎన్‌టీ విభాగం సంయుక్తంగా ఉచిత ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించింది. గ్రామీణ ప్రాంత ప్రజలకు నిపుణులైన వైద్య సేవలు అందించడం, సాధారణ వ్యాధులను ముందుగానే గుర్తించి నివారించడమే శిబిరం ప్రధాన ఉద్దేశమని వైద్యులు తెలిపారు. ఈ సందర్భంగా ఈఎన్‌టీ నిపుణులు తల, మెడ క్యాన్సర్ల గుర్తింపునకు క్లినికల్ పరీక్షలు నిర్వహించి స్క్రీనింగ్ చేశారు. రోగులకు తగిన కౌన్సెలింగ్ అందించడంతో పాటు నోటి క్యాన్సర్ లక్షణాలపై అవగాహన కల్పించారు. మానని నోటి పూతలు, నోటిలో తెలుపు లేదా ఎరుపు మచ్చలు, మింగడంలో ఇబ్బంది, నిరంతర బొంగురు గొంతు వంటి హెచ్చరిక సంకేతాలను నిర్లక్ష్యం చేయరాదని సూచించారు. వీటిని ముందుగానే గుర్తించడం ద్వారా చికిత్స సులభమవుతుందని, పొగాకు, వక్కపొడి వినియోగం వల్ల క్యాన్సర్ ముప్పు పెరుగుతుందని వివరించారు. అంటువ్యాధులు కాని వ్యాధుల (ఎన్‌సీడీ) నివారణ, ఆరోగ్యకరమైన జీవనశైలిపై కూడా అవగాహన కల్పించారు. తదుపరి పరీక్షలు, చికిత్స అవసరమైన రోగులను ఎయిమ్స్ బీబీనగర్‌కు రిఫర్ చేశారు. శిబిరంలో మొత్తం 80 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. మొరిపిరాల గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని అభినందించారు. ఎయిమ్స్ బీబీనగర్ కమ్యూనిటీ మెడిసిన్ అండ్ ఫ్యామిలీ మెడిసిన్, ఈఎన్‌టీ విభాగాల అధ్యాపకులు, రెసిడెంట్ వైద్యులు, సిబ్బంది, మొబైల్ మెడికల్ యూనిట్ బృందం సంయుక్తంగా శిబిరాన్ని నిర్వహించారు. సమాజంలో స్క్రీనింగ్ కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహించడం, వ్యాధులను ముందుగానే గుర్తించి చికిత్స అందించడం పట్ల తమ సంస్థ కట్టుబడి ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం ఆరోగ్యకరమైన, శక్తివంతమైన సమాజ నిర్మాణానికి దోహదపడుతుందని తెలిపారు. ఈ శిబిరం విజయవంతం కావడానికి మొరిపిరాల గ్రామ పంచాయతీ సర్పంచ్, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు సహకరించారు.

Wednesday Page 9 29 Jul 2026
https://www.timesofvartha.in/clip/63752